# సాక్షి నంద్యాల

ఆదివారం । 18 । అక్టోబర్ । 2026






**మట్టి తీయకుండా 'మస్టర్' ప్లాన్!**

మట్టి తీయకుండా 793 పనిదినాలకు మస్టరు వేశారు. టీడీపీ నాయకులు, ఉపాధి సిబ్బంది కుమ్మక్కై రూ.2.47 లక్షల కొల్లగొట్టారు.

IIలో▸



**కుక్కల దాడి...**

దొర్నిపాడులో ఎనిమిదేళ్ల బాలుడిపై శనివారం కుక్కలు దాడి చేశాయి. తీవ్రంగా గాయపడిన బాలుడిని ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు.

IIలో▸



**టీబీ డ్యాం సమాచారం**

| | |
|---|---|
| పూర్తి మట్టం | :1,633 అడుగులు |
| ప్రస్తుతం | :1,617.490 |
| టీఎంసీల సామర్థ్యం | :105.788 |
| ప్రస్తుతం | :54.548 |
| ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు) | :0 |
| ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు) | :12,277 |

## న్యూస్‌రీల్

### అబ్జర్వర్ల నియామకం

**నంద్యాల(న్యూటౌన్):** జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల పర్యవేక్షణకు జనరల్ అబ్జర్వర్‌గా ఐఏఎస్ అధికారి జె.వెంకట మురళి, ఎక్స్‌పెండిచర్ అబ్జర్వర్‌గా ఐఎఫ్‌ఎస్ అధికారి పి.శ్యామల నియమితులైనట్లు జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరిగేలా జనరల్ అబ్జర్వర్ పర్యవేక్షిస్తారని కలెక్టర్ తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు, ఎన్నికల నిర్వహణకు సంబంధించి వివిధ దశల్లో చేపట్టే చర్యలను పరిశీలిస్తారని పేర్కొన్నారు. ఎన్నికల సందర్భంగా అభ్యర్థులు చేసే వ్యయంపై ఎక్స్‌పెండిచర్ అబ్జర్వర్ పర్యవేక్షణ చేపడతారని తెలిపారు.

### శ్రీశైలం డ్యాం నీటిమట్టం 839 అడుగులు

**శ్రీశైలంప్రాజెక్ట్:** శ్రీశైలం డ్యాం పూర్తి నీటిమట్టం 885 అడుగులు కాగా.. శనివారం సాయంత్రానికి 839.50 అడుగులకు చేరుకుంది. జలాశయంలో 61.0654 టీఎంసీల నీరు నిల్వ ఉంది. శ్రీశైలం జలాశయం నుంచి దిగువ ప్రాజెక్టులకు 8,974 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. బ్యాక్‌వాటర్ నుంచి హంద్రీనీవా సుజలస్రవంతికి 1,694 క్యూసెక్కులు, తెలంగాణాలోని కల్వకుర్తి ఎత్తిపోతలకు 2,400 క్యూసెక్కులు సరఫరా అవుతోంది. ఎడమగట్టు జలవిద్యుత్ కేంద్రంలో 2.239 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసి నాగార్జునసాగర్‌కు 4,880 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

### డిసెంబర్ 3 వరకు పీజీఆర్ఎస్ రద్దు

**నంద్యాల(న్యూటౌన్):** ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్), రెవెన్యూ క్లినిక్‌ను డిసెంబర్ 3వ తేదీ వరకు రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ రాజకుమారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లో నిర్వహించే పీజీఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్‌తో పాటు క్షేత్రస్థాయి పీజీఆర్ఎస్ కార్యక్రమాలు కూడా డిసెంబర్ 3వ తేదీ వరకు నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

### రెండో రోజు 565 నామినేషన్లు

**నంద్యాల(న్యూటౌన్):** జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి రెండో రోజు మొత్తం 565 నామినేషన్లు వచ్చినట్లు జిల్లా కలెక్టర్ రాజకుమారి తెలిపారు. చైర్‌పర్సన్ పదవులకు 34, వార్డు మెంబర్ పదవులకు 531 నామినేషన్లు దాఖలయ్యాయని పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రెండో రోజు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిందని తెలిపారు. మొదటి రోజు మొత్తం 548 నామినేషన్లు దాఖలైనట్లు కలెక్టర్ పేర్కొన్నారు.

### మూడు రోజులు వర్షాలు కురిసే అవకాశం

**ఎమ్మిగనూరు రూరల్:** జిల్లాలో రానున్న మూడు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ రాఘవేంద్రచౌదరి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. భారత వాతావరణ శాఖ సూచన మేరకు దక్షణ భారతదేశం, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల అవర్తనం వాయుగుండగా బలపడిందన్నారు. ఈ నెల 19 నుంచి 21వ తేది వరకు తేలికపాటి మోస్తరు వర్షాలు కురుస్తాయని ఆయన చెప్పారు. జిలాల్లో ఈ నెల 19వ తేదిన 7.5 మి.మీ, 20వ తేదిన 12.3 మి.మీ, 21వ తేదిన 10.8 మిల్లి మీటర్ల వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందన్నారు.

### ఆర్‌యూ రిజిస్ట్రార్ పదవీ కాలం పొడిగింపు

**కర్నూలు కల్చరల్:** రాయలసీమ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి. విజయ్‌కుమార్ నాయుడు పదవీ కాలంలో మరో ఏడాది పొడించారు. వైఎస్సార్ కడప యోగి వేమన యూనివర్సిటీకి చెందిన ఆయన 2024 అక్టోబర్‌లో ఆర్‌యూ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈనెల 16వ తేదీకి రెండు సంవత్సరాలు పూర్తి కావడంతో మరో ఏడాది పదవీ కాలాన్ని పొడిగిస్తూ వర్సిటీ వైస్‌ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ వి.వెంకట బసవరావు ఆదేశాలు జారీ చేశారు.

### బరిలో టీడీపీ రెబల్స్

**కోడుమూరు రూరల్:** కర్నూలు జిల్లా గూడూరు నగర పంచాయతీ చైర్మన్ స్థానాన్ని కూటమి నేతలు బీజేపీకి కేటాయించారు. ఆ మేరకు బీజేపీ నేత డమాం సురేష్ భార్య డమాం సునీతాబాయి శనివారం నగర పంచాయతీ చైర్మన్ స్థానానికి నామినేషన్ దాఖలు చేశారు. అయితే అధిష్టానం ఆదేశాలను ధిక్కరిస్తూ స్థానిక టీడీపీ నేతలు రామాంజినేయులు, జుట్ల వెంకటేశ్వర్లు తమ అనుచరులతో ర్యాలీగా వెళ్లి తెలుగుదేశం పార్టీ తరపున మొత్తం 10వార్డులకు నామినేషన్లు దాఖలు చేయించారు. పొత్తులో భాగంగా బీజేపీకి కేటాయించిన స్థానంలో టీడీపీ నేతలు నామినేషన్లు దాఖలు చేయడం చర్చనీయాంశమైంది.

# గజవాహనంపై దివ్యతేజం



స్వామిఅమ్మవార్లకు ఆలయ ఉత్సవం



శంఖం పూరిస్తున్న దృశ్యం

**శ్రీశైలంటెంపుల్:** దసరా మహోత్సవాల్లో భాగంగా శనివారం శ్రీశైలంలో గజవాహనంపై స్వామి, అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. గజ వాహనంపై కొలువుదీరిన పార్వతీ పరమేశ్వరులను అలంకార మండపంలోకి అధిష్టింపజేసి అర్చకులు, పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కాళరాత్రి అమ్మవారిని, గజ వాహనాధీశులైన స్వామిఅమ్మవార్లకు ఆలయ ఉత్సవం జరిపారు. గంగాధర మండపం నుంచి నందిమండపం, బయలువీరభద్రస్వామి ఆలయం వరకు నిర్వహించిన గ్రామోత్సవం కనులపండువగా సాగింది.



గజవాహనంపై ఆదిదంపతులు

గ్రామోత్సవంలో సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పూజా కార్యక్రమాల్లో దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు దంపతులు, ఇతర విభాగాల అధికారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

**శ్రీశైలంలో నేడు..**

దసరా ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు ఆదివారం భ్రమరాంబాదేవి మహాగౌరి అలంకారంలో, భ్రమరాంబా సమేత మల్లికార్జున స్వామిఅమ్మవార్లు నందివాహనంపై భక్తులకు దర్శనమివ్వనున్నారు.

**శుభంకరీ.. కాళరాత్రి**

దసరా మహోత్సవాల్లో భాగంగా శనివారం శ్రీ భ్రమరాంబాదేవి అమ్మవారు కాళరాత్రి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ అలంకారంలో అమ్మవారు గార్ధభ వాహనంపై నల్లని వర్ణంలో ఉంటారు. శిరోజాలు చెల్లాచెదురై.. మెడలో శక్తికాంతులు వెదజల్లే హారం ఉండి, త్రినేత్రాలు బ్రహ్మాండ సమంగా గోళాకారంలో ఉంటాయి. కుడిచేతి ద్వారా సమస్త ప్రాణులకు వరాలను ప్రసాదిస్తూ.. కిందిచేయి హస్తం అభయముద్రలో ఉంటుంది. ఎడమ చేతిలో ఖడ్గం, కింది హస్తంలో లోహకంటకం ఉంటాయి. అమ్మవారిని ఉపాసిస్తే గ్రహబాధల నుంచి ఉపశమనం లభిస్తుంది.



అమ్మవారికి పూజలు చేస్తున్న అర్చకులు



కళాకారుల నృత్య ప్రదర్శన

# టీడీపీలో రగిలిన అసమ్మతి

- ఎమ్మెల్యే కోట్లతో విత్తనాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి అమీతుమీ
- డోన్, బేతంచెర్లలో అన్ని స్థానాలకు పోటీకి రెబల్స్

**డోన్:** విత్తనాభివృద్ధి సంస్థ మాజీ చైర్మెన్ ధర్మవరం సుబ్బారెడ్డికి పురపోరులో అభ్యర్థుల ఎంపిక సందర్భంగా ప్రాధాన్యత ఇవ్వకపోవడం రాజకీయ పోరుకు ఆజ్యం పోసింది. నంద్యాల జిల్లా డోన్, బేతంచెర్ల నగరపాలక సంస్థ ఎన్నికల్లో చైర్మన్‌తో పాటు అన్ని కౌన్సిల్ స్థానాలకు సుబ్బారెడ్డి అనుచరులు నామినేషన్లు దాఖలు చేసి ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డితో అమీతుమీ తెల్చుకునేందుకు సిద్ధమయ్యారు. సుబ్బారెడ్డి, ఎమ్మెల్యే కోట్ల వర్గీయుల మధ్య అభ్యర్థుల ఎంపికలో ఏకాభిప్రాయం తీసుకొచ్చేందుకు శనివారం డోన్‌కు విచ్చేసిన ఎంపీ శబరి మొదట సుబ్బారెడ్డిని కలిశారు. తిరిగి ఆమె ఎమ్మెల్యే కోట్లతో సంప్రదింపులు జరుపుతుండగానే అధిస్టానం డోన్ చైర్మన్ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ, బేతంచెర్ల చైర్మన్ అభ్యర్థిగా లోకేష్ గౌడ్‌ను ఎంపిక చేసినట్లు ప్రకటన విడుదల చేయడం మరింత అగ్గి రాజేసింది. ఈ విషయంలో ఎంపీ సైతం కినుక వహించినట్లు సమాచారం. తనను చర్చలకు పంపి ఇలా అభ్యర్థులను ప్రకటించడం ఏమిటని ఆమె అసహనానికి లోనైనట్లు తెలిసింది. ప్రతిసారీ టీడీపీ అధిస్టానం తమ నాయకుడిని మోసగిస్తుండటం పట్ల సుబ్బారెడ్డి వర్గీయులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎలాంటి పరిస్థితుల్లో టీడీపీ రెబల్ అభ్యర్థులుగా బరిలో ఉంటామని తెల్చి చెప్పారు. ఇదిలాఉంటే చిన్న చిన్న పదవులు పార్టీ కార్యకర్తలకు కట్టబెట్టకుండా మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ మున్సిపల్ చైర్మన్ పదవి ఆశించడం పట్ల టీడీపీలోనే నిరసన వ్యక్తమవుతోంది. ఆర్యవైశ్యుల్లో ముగ్గురు వ్యక్తులతో పాటు బీసీ కులానికి చెందిన వ్యక్తి చైర్మన్ పదవి ఆశించినా మొండిచేయి చూపడం పట్ల ఆయా వర్గాలు రగిలిపోతున్నాయి.

# మొక్కజొన్న.. కలిసి రాలేదన్నా..!

- ఎల్‌నినో దెబ్బకు దిగుబడి ఢమాల్
- ఎకరాకు 15 నుంచి 18 క్వింటాళ్లలోపే
- రెండేళ్లుగా నష్టాలతో రైతుల అప్పులపాలు



కోవెలకుంట్ల సమీపంలో ఆరబోసిన మొక్కజొన్న దిగుబడులు

**కోవెలకుంట్ల:** ఎల్‌నినో భయంతో వర్షాధార పంటగా మొక్కజొన్న సాగు చేసినా రైతులు చివరకు నష్టాలే మూటగట్టుకోవాల్సి వచ్చింది. విత్తనం నాటినప్పటి నుంచి ఒక్క దఫా కూడా వర్షం పడకపోవడంతో వర్షాధార పంటలు ఎండిపోగా సాగు నీటి వనరుల ఆధారంగా అరకొర దిగుబడులకే పరిమితం కావడంతో అన్నదాతలు కుదేలయ్యారు. జిల్లాలోని 29 మండలాల పరిధిలో ఈ ఏడాది ఖరీఫ్‌లో 61,615 హెక్టార్లలో సాగు సాధారణ విస్తీర్ణం కాగా వర్షాభావ పరిస్థితులు, సాగునీటి వనరులు అందుబాటులో లేకపోవడంతో 26,364 హెక్టార్లకే సాగు పరిమితమైంది. ఇందులో జిల్లాలోని కొత్తపల్లి మండలంలో అత్యధికంగా 3,830 హెక్టార్లు, పాములపాడు 3,517, నందికొట్కూరు 3,009, బనగానపల్లె 2,584, పగిడ్యాల 2,326, జూపాడు బంగ్లా 1,943, మిడుతూరు 1,762, రుద్రవరం 1,452, ఆత్మకూరు 1,120, ఆళ్లగడ్డ మండలంలో 1,096 హెక్టార్లలో సాగైంది. మిగిలిన మండలాల్లో వెయ్యి హెక్టార్లలోపే సాగు పరితమైంది. ప్రస్తుతం పంటచేతికందటంతో కోత, నూర్పిడి పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు, కలుపు నివారణ, కోత, నూర్పిడి, తదితర పెట్టుబడుల రూపంలో ఎకరాకు రూ. 35 వేలకు పైగా వెచ్చించారు. సాగునీటి మళ్లింపునకు ఎకరాకు రూ. 5 వేలు అదనపు భారం పడింది. అన్ని కష్టాలు పడి పైరును దక్కించుకున్నా భూమిలో ముందస్తు తేమ లేకపోవడంతో వాతావరణం అనుకూలించక దిగుబడులు గణనీయంగా తగ్గిపోయాయి. ఎకరాకు 15 క్వింటాళ్ల నుంచి 18 క్వింటాళ్లకే దిగుబడులు పరిమితం కావడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్‌లో ప్రస్తుతం క్వింటా రూ. 2,500 ధర పలుకుతోంది. ఈ ధర తగ్గకుండా ఇలాగే కొనసాగితే కనీసం పెట్టుబడులైనా వస్తాయని రైతులు అంటున్నారు.

## ఎన్నికల నిబంధనల మేరకు నామినేషన్ల స్వీకరణ

- జిల్లా కలెక్టర్ రాజకుమారి





మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజకుమారి

**నంద్యాల(న్యూటౌన్):** ఎన్నికల నిబంధనలు పాటిస్తూ ఎంపీటీసీ, జెడ్పీటీసీ అభ్యర్థుల నామినేషన్లను తీసుకోవాలని అధికారులకు జిల్లా కలెక్టర్ రాజకుమారి సూచించారు. కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో శనివారం ఆర్ఓ, ఏఆర్ఓలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శిక్షణలో కలెక్టర్ మాట్లాడుతూ.. నిర్ణీత సమయం నుంచి సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే నామినేషన్లను స్వీకరించాలన్నారు. నామినేషన్‌లో అభ్యర్థి సమర్పించిన ప్రతి పత్రాన్ని నిశితంగా పరిశీలించాలన్నారు. అభ్యర్థి వివరాలు, సంతకాలు, ప్రతిపాదకుల వివరాలు, అవసరమైన ధ్రువపత్రాలు, డిపాజిట్ తదితర అంశాలను ఎన్నికల నిబంధనల ప్రకారం ధ్రువీకరించాలన్నారు. నామినేషన్ల పరిశీలన సమయంలో ఎలాంటి సందేహాలకు తావులేకుండా రికార్డులను సక్రమంగా నిర్వహించాలన్నారు. నామినేషన్ల ఉపసంహరణకు సంబంధించిన ఫారమ్–7 స్వీకరించాలన్నారు. ఎన్నికల పరిశీలకుల పర్యవేక్షణకు అవసరమైన ఏర్పాట్లు చేయడంతోపాటు పోలీసు శాఖతో సమన్వయం చేసుకుని శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు చేపట్టాలన్నారు. శిక్షణ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ ప్రియాంక, జిల్లా పరిషత్ సీఈఓ శివశంకర్, డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి, జిల్లా అధికారులు, తహసీల్దార్‌లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

## రాజకీయ ప్రకటనలకు ముందస్తు ధ్రువీకరణ తప్పనిసరి

**కర్నూలు(సెంట్రల్):** స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో రాజకీయ పార్టీలు, అభ్యర్థులు రాజకీయ ప్రకటనలను ప్రచారం చేసుకునే ముందు మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ(ఎంసీఎంసీ) నుంచి ముందస్తు ధ్రువీకరణ పొందాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రానిక్ మీడియా, ప్రింట్ మీడియా, సోషల్ మీడియా, కేబుల్ నెట్‌వర్క్‌లు, రేడియో, సినిమా హాల్స్, బల్క్ ఎస్ఎంఎస్‌లు తదితర మాధ్యమాల్లో ప్రసారమయ్యే రాజకీయ ప్రకటనలను పర్యవేక్షించడంతో పాటు, పెయిడ్ న్యూస్‌పై కూడా ఎంసీఎంసీ కమిటీ నిఘా ఉంచుతుందన్నారు. రాజకీయ ప్రకటనల ముందస్తు ధ్రువీకరణ, సంబంధిత అనుమతులు, పెయిడ్ న్యూస్ పర్యవేక్షణకు కర్నూలు కలెక్టరేట్‌లోని సీపీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎంసీఎంసీ సెల్‌ను సంప్రదించాలని కలెక్టర్ సూచించారు. ప్రకటనను ప్రసారం చేయడానికి లేదా ప్రదర్శించడానికి నిర్ణయించిన తేదీకి కనీసం 3 రోజుల ముందు నిర్దేశించిన ప్రొఫార్మాలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

## స్థానిక ఎన్నికల్లో జనాభాకు అనుగుణంగా వ్యయం

**నామినేషన్ డిపాజిట్ వివరాలు**

| ప్రజా ప్రతినిధి హోదా | డిపాజిట్ ( ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు మినహా ) | ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు |
|---|---|---|
| గ్రామ పంచాయతీ వార్డు సభ్యుడు | రూ.1000 | రూ.500 |
| సర్పంచు | రూ.3000 | రూ.1500 |
| ఎంపీటీసీ | రూ.3000 | రూ.1500 |
| జెడ్పీటీసీ | రూ.6000 | రూ.3000 |

**కర్నూలు(అర్బన్):** స్థానిక సంస్థల(వార్డు సభ్యులు, సర్పంచు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ) ఎన్నికల్లో అభ్యర్థులు చేసే ఖర్చుకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను విడుదల చేసింది. వార్డు సభ్యుడు తన పరిధిలో 10 వేల కంటే తక్కువ జనాభా ఉంటే రూ.60 వేలు, 10 వేల కంటే ఎక్కువ జనాభా ఉంటే రూ.లక్షకు మించి ఖర్చు చేయకూడదు. అలాగే సర్పంచు స్థానానికి పోటీ చేస్తున్న అభ్యర్థులు 10 వేల కంటే తక్కువ ఉన్న గ్రామ పంచాయతీలో రూ.2.50 లక్షలు, 10 వేల కంటే ఎక్కువ జనాభా ఉన్న గ్రామ పంచాయతీలో రూ.4 లక్షల కంటే ఎక్కువ వెచ్చించరాదు. మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గం(ఎంపీటీసీ) నుంచి పోటీ చేసే అభ్యర్థి రూ.4 లక్షలు, జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గం(జెడ్పీటీసీ) నుంచి పోటీ చేసే అభ్యర్థి రూ.8 లక్షలకు మించి ఖర్చు చేయరాదని ఎస్ఈసీ మార్గదర్శకాలను విడుదల చేసింది.

# కల్లూరు అర్బన్‌లో టీడీపీకి షాక్



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో కాటసాని రాంభూపాల్‌రెడ్డి, కాటసాని శివనరసింహారెడ్డి

- టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిక

**కల్లూరు:** కల్లూరు అర్బన్‌లో టీడీపీకి షాక్ తగిలింది. స్థానిక సంస్థల ఎన్నికల వేళ టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి వలసలు ఊపందుకున్నాయి. శనివారం తెలుగు యువత జిల్లా మాజీ అధ్యక్షుడు వడ్డే రవితో పాటు కల్లూరు అర్బన్ 45వ వార్డు టీడీపీ నాయకులు స్వాములు, అంజితో పాటు పది కుటుంబాల సభ్యులు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరందరికీ వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, పార్టీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాటసాని శివనరసింహారెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా కాటసాని రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. మున్సిపల్ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరడమే లక్ష్యంగా నాయకులందరూ సమష్టిగా పని చేయాలన్నారు. కర్నూలు కార్పొరేషన్ పరిధిలోని 68 వార్డుల్లో బరిలో నిలచే వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు, మద్దతుదాలను గెలిపించాలని పిలుపునిచ్చారు. ప్రతి వైఎస్సార్‌సీపీ కార్యకర్త సైనికుడిలా పని చేయాలన్నారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మిద్దూరు శ్రీనివాసులు, సాపూరి వీరయ్య, కాశన్న, హనుమంతయ్య, సుభాన్, కుమ్మరి వెంకటేశ్వర్లు, నవీన్‌రెడ్డి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

### ఎకరాకు 15 క్వింటాళ్లే



ఎకరా రూ. 16 వేలు కౌలు చెల్లించి ఈ ఏడాది ఖరీఫ్‌లో ఏడు ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశాను. విత్తనం నాటినప్పటి నుంచి వర్షాలు కురియకపోవడంతో సాగు నీటిని మళ్లించేందుకు అష్టకష్టాలు పడాల్సి వచ్చింది. రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు, తదితర పెట్టుబడుల రూపంలో ఎకరాకు రూ. 35 వేలు ఖర్చు వచ్చింది. ఇటీవలే నాలుగు ఎకరాల్లో కోత, నూర్పిడి పనులు చేపట్టాను. వర్షాభావ పరిస్థితులతో ఎకరాకు 15 క్వింటాళ్లకు మించి దిగుబడులు రాలేదు.

– పుల్లారెడ్డి, అమడాల, కోవెలకుంట్ల మండలం

### పెట్టుబడి చేతికందేలా లేదు



ఈ ఏడాది ఎకరా సొంత పొలంతోపాటు ఎకరాకు రూ. 16 వేలు చెల్లించి మరో నాలుగున్నర ఎకరాలు కౌలుకు తీసుకుని మొక్కజొన్న సాగు చేశాను. పైరు వివిధ దశల్లో వర్షాలు కురియకపోడంతో బోరు సాయంతో పైరుకు పలు దఫాలు సాగునీటిని మళ్లించుకున్నాను. ఎకరాకు 40 వేలకు పైగా ఖర్చు చేయగా ఎకరాకు 15 క్వింటాళ్లకు మించి దిగుబడి రాలేదు. పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితులు లేవు.

– హరి, రైతు, సొదరదిన్నె, కోవెలకుంట్ల మండలం

**వెంటాడుతున్న నష్టాలు..**

గత ఏడాది ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో 54,150 హెక్టార్లలో మొక్కజొన్న సాగు సాధారణ విస్తీర్ణం కాగా ఆయా మండలాల పరిధిలో 55,408 హెక్టార్లలో సాగైంది. బోర్లు, బావులు, చెరువులు, ఎస్సార్బీసీ, కేసీ కెనాల్, తదితర సాగు నీరు వనరులు అందుబాటులో ఉండటంతో లక్ష్యానికి మించి సాగైంది. ఎకరాకు 30 నుంచి 35 క్వింటాళ్ల దిగుబడులు వస్తాయనుకుంటే వర్షాభావం, పుప్పడి రాలిపోడం, తెగుళ్లతో ఎకరాకు 20 నుంచి 22 క్వింటాళ్లకే దిగుబడులు పరిమితమయ్యాయి. గిట్టుబాటు ధరలేక క్వింటా రూ. 2 వేలలోపే విక్రయించి నష్టాలు మూటగట్టుకున్నారు. గత రెండేళ్ల నుంచి రైతులకు మొక్కజొన్న సాగు భారంగా మారింది. పంటల బీమా కట్టినా రైతులకు పంటనష్ట పరిహారం, ఇన్సూరెన్స్ అందటం లేదు. గతేడాది మొంథా తుపాన్ కారణంగా వేలాది ఎకరాల్లో పంట నష్టం జరిగినా ఇప్పటి వరకు పంటనష్ట పరిహారం అందలేదు. ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావం కారణంగా వర్షాలు తక్కువగా కురుస్తాయని వర్షాభావ పరిస్థితులపై వాతావరణ నిపుణులు పలుసార్లు హెచ్చరికలు జారీ చేసినప్పటికీ రైతులకు భరోసా కల్పించేలా చంద్రబాబు ప్రభుత్వం చర్యలు తీసుకోలేదు.

